క్లుప్తంగా...

రేపు మహిళా దినోత్సవ వేడుకలు

లాలాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8న తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పి.మోహన్‌రావు, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వివిధ రకాల ఆటల పోటీలు ఉంటాయని ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

మూడోవార్డులో రాజుసింగ్ పర్యటన



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు మడ్‌ఫోర్ట్, కార్ఖానాలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నాయకులు రాజుసింగ్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఈ సందర్భంగా స్థానికులు ఆయనను కోరారు. తాను స్థానికుడినని ఇతర వార్డుల్లో ఉండే నాయకులు వచ్చి ఇక్కడ డ్రామా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వారికి అవకాశం కల్పిస్తే సమస్యలు చెప్పుకోవడానికి ఇతర వార్డుకు వెళ్లాల్సి వస్తుందని ఈ సారి జరిగే బోర్డు పాలకమండలి ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వాలని రాజుసింగ్ కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళా దినోత్సవాల్లో పాల్గొన్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మారేడుపల్లి, రసూల్‌పురాలో సోమవారం బీఆర్‌ఎస్ నేత ఎన్. శ్రీగణేశ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేశ్ మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లోనూ పురుషులతో పోటీగా రాణిస్తున్న మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటు అందించాల్సి ఉంటున్నారు. తాను నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటికే మహిళల ఆర్థిక స్వావలంబనకు సొంత నిధులతో యంత్రాలు అందజేశానన్నారు. పలు పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శరత్‌కుమార్, గౌతమ్, కిరణ్, శివన్, షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న గుర్రం జ్యోతి చెన్నకేశవరెడ్డి

లాలాపేట: త్వరలో జరగనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి మద్దతుదారులు సోమవారం మారేడుపల్లి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాల(గడిస్కూల్) బాలికల పాఠశాల(మార్కెట్ స్కూల్), రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్, అడ్డగుట్ట, వెస్ట్‌మారేడుపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి సతీమణి జ్యోతి చెన్నకేశవరెడ్డి తోటి మహిళా ఉపాధ్యాయులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో నారాయణ, రవీందర్, అపర్ణ, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఐక్యతతో కేసీఆర్‌ను గద్దె దించుదాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యమకారుల ఐక్యతతో సీఎం కేసీఆర్‌ను గద్దె దించుదామని తెలంగాణ ఉద్యమ విద్యార్థులు పేర్కొన్నారు. సోమవారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమకారుల సదస్సులో భట్టు శ్రీహరినాయక్, పాలమూరు వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ నాగం కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర నాయకులు దరువు ఎల్లన్న మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులను విస్మరించిన సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఉద్యమకారులను ఐక్యం చేసి గద్దె దించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం 8 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సంతోష్‌ముదిరాజ్, శివరాత్రి ప్రశాంత్, నవీన్‌యాదవ్, సర్దార్ వినోద్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సాహితీ పాల్గొన్నారు.



ఐక్యత ప్రదర్శిస్తున్న ఉద్యమ విద్యార్థి నేతలు

బోర్డులో లక్ష ఓట్లు గాయబ్!

ఏడేళ్లలో 60 వేలు తగ్గిన ఓటర్లు

- స్థానికులను తొలగించి, ఆర్మీ సిబ్బందికి ఓటు హక్కు
- ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు



కంటోన్మెంట్: సాధారణంగా ఏ ప్రాంతంలోనైనా ఓటర్ల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. కానీ కంటోన్మెంట్‌లో మాత్రం తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఓటరు జాబితాలో స్థానం కల్పించొద్దంటూ 2017లోనే సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో రక్షణ, ఎయిర్‌పోర్టు, రాష్ట్ర ప్రభుత్వ భూముల ఆక్రమణలదారులకు ఓటు హక్కు తొలగించారు. దశల వారీగా చేపట్టిన తొలగింపులో ఏకంగా లక్ష మంది ఓటు హక్కును కోల్పోవడంగమనార్హం. ఒకే ప్రాంతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన స్థానిక సంస్థలో ఓటు లేని వారు లక్ష మందికి పైగా ఉండటాన్ని ప్రజాస్వామిక వాదులు తప్పుబడుతున్నారు. ఈ వివక్షపై కొన్నేళ్లుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ హైకోర్టులోనూ కేసు వేశారు. తాజాగా బాధితులతో కలిసి ఆందోళనను తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 10న కంటోన్మెంట్ బోర్డు ముట్టడికి పిలుపునిచ్చారు.

లక్ష మందిపై వేటు..

2007లో వార్డుల డిలిమిటేషన్ జరగ్గా, కంటోన్మెంట్ ఎలక్టోరల్ రూల్స్‌కు అనుగుణంగా తొలిసారిగా పూర్తిస్థాయిలో ఓటరు జాబితా రూపొందించారు. ఈ జాబితాలో ఎనిమిది వార్డులకు 1,91,571 మంది ఓటర్లు ఉండగా ఇదే జాబితా ఆధారంగా 2008లో ఎన్నికలు నిర్వహించారు. 2015లో జరిగిన ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య అనూహ్యంగా 1,63,630కి తగ్గింది. వార్డుల వారీగా పెద్ద సంఖ్యలో బోగస్ ఓట్లు ఉండగా, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి పెద్ద సంఖ్యలో బోగస్ ఓట్లను తొలగించారు. ఈ సారి సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా ప్రభుత్వ స్థలాల ఆక్రమిత నివాసాల్లోని వారి ఓట్లు తొలగించారు.

రెండో వార్డుపై ప్రభావం..

2019లో చేపట్టిన తొలి దశ తొలగింపు చర్యల్లో భాగంగా 28,419 ఓటర్లు తగ్గారు. అయితే ఇది ఆ ఏడాదిలో నూతన ఓటర్లను కూడా కలుపుకుంటే తొలగింపునకు గురైన ఓట్ల సంఖ్య 30 వేలకు పైగానే ఉంటుంది. మళ్లీ 2020 నాటికి తుది ఓటర్ల సంఖ్య మళ్లీ తగ్గి 1,42,782కు చేరింది. అంటే ఈ ఏడాదిలోనూ మరో 20,648 ఓట్లు తగ్గాయి. ఇక తాజాగా మొత్తం ఓటర్ల సంఖ్య మరో పదివేలు తగ్గి ఏకంగా 1,32,722కు చేరింది. మొత్తంగా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం గత నాలుగేళ్లలో కంటోన్మెంట్ ఓటర్ల సంఖ్య 59,127 తక్కువగా ఉంది. ప్రతీయేటా కనీసం 5 శాతం నూతన ఓటర్లను పరిగణనలోకి తీసుకుంటే నాలుగేళ్లలో లక్ష మంది కంటోన్మెంట్ ఓటర్లపై వేటు పడింది. ఓట్ల తొలగింపు ప్రభావం రెండోవార్డుపై తీవ్రంగా పడింది. 2018లో 32,705 ఓట్లతో కంటోన్మెంట్‌లోనే అతిపెద్ద వార్డుగా ఉండగా, ఓట్ల తొలగింపతో కేవలం 7,872 మంది ఓటర్లతో అతిచిన్న వార్డుగా మారి వార్డు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

స్థానికేతర ఆర్మీ సిబ్బందికి ఓట్లు..

ఓ పక్క స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికకు సంబంధించిన ఓటరు జాబితాలో ప్రభుత్వ స్థలాల ఆక్రమితులకు ఓట్లు తొలగించిన బోర్డు అధికారులు, స్థానికేతరులైన ఆర్మీ సిబ్బందికి ఓటు హక్కు కల్పించడం గమనార్హం. ఓటు హక్కు కలిగిన ఆర్మీ క్వార్టర్లలోకి వెళ్లి ప్రచారం చేసేందుకు అభ్యర్థులకు అవకాశం ఉండదు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్న పలువురు నేతలు న్యాయపోరాటానికి సైతం సిద్ధమవుతున్నారు. మున్సిపల్ తరహా పాలనలో ఆర్మీకి ఏమాత్రం సంబంధంలేని ప్రజాప్రతినిధులు, ఆర్మీ సిబ్బంది ఎలా ఎన్నుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

> **ముట్టడితోనే పరిష్కారం..**
>
> కంటోన్మెంట్ వ్యాప్తంగా లక్ష మంది ఓట్లు కోల్పోవడం తీవ్రమైన చర్యగా భావిస్తున్నాం. బాధితులతో కలిసి ఈ నెల 10న కంటోన్మెంట్ బోర్డు ముట్టడికి పిలుపునిచ్చాం. తాజాగా ఆయా బస్తీల్లో పర్యటించి, వారికి న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నాం. ఓట్ల పునరుద్ధరణకు ఓ వైపు కోర్టులో పోరాడుతూనే క్షేత్రస్థాయిలోనూ ఉద్యమిస్తున్నాం.
>
> –క్రిశాంక్

వార్డుల వారీగా ఓట్ల వివరాలు..

వార్డు	2015	2018	ప్రస్తుతం
1	19,773	26,306	20,826
2	21,964	32,705	7,872
3	19,375	22,037	15,922
4	14,687	16,682	13,956
5	22,204	28,720	22,919
6	23,667	23,415	21844
7	21,123	21730	12,461
8	20,837	20,254	16,922
మొత్తం	1,63,630	1,91,849	1,32,722



బాధితులతో సమావేశంలో మాట్లాడుతున్న క్రిశాంక్

మంత్రి పర్యటనలో సమస్యల ఏకరువు

పరిష్కారానికి హామీ ఇచ్చిన తలసాని

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పొట్టి శ్రీరాములు నగర్, సీసీనగర్, జయప్రకాష్ నగర్ ప్రాంతాల్లో సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించగా స్థానికులు సమస్యలు ఏకరువు పెట్టారు. డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలు చేపట్టిన పొట్టి శ్రీరాములు నగర్‌లో రాత్రి వేళలో ప్రహరీ దూకి మిద్దెలపై కొంతమంది మద్యం తాగు హంగామా సృష్టిస్తున్నారన్నారు. నీటి ఎద్దడి తీర్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. బస్తీలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని మంత్రితో మొరపెట్టారు. చాచానెహ్రూనగర్ ప్రాంతంలో స్థానిక ప్రజలు తమ ప్రాంతంలో తాగునీటి సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలన్నారు. 'డబుల్' ఇళ్ల నిర్మాణం సందర్భంగా వేసిన మట్టి, చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించాలని జయప్రకాశ్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని మంత్రిని కోరగా స్పందించి ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీసులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, హౌసింగ్ ఈఈ వెంకటదాస్‌రెడ్డి, జలమండలి జీఎం రమణారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రాఘవేందర్, విద్యుత్తు శాఖ ఏడీఈ క్రిష్ణ, తహసీల్దార్ జానకి, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు, పవన్‌కుమార్ గౌడ్, ప్రేమ్, లక్ష్మీపతి, గజ్జెల శ్రీనివాస్, వెంకటేశన్, సురేష్, ముక్కా శ్రీనివాస్, అబ్బాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రాష్ట్రంలో వైభవంగా పండుగలు

రాంగోపాల్‌పేట్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పండుగలు, ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. భద్రాచలంలో ఈ నెల 30న శ్రీరామనవమి సందర్భంగా సీతారాములకు అలంకరించనున్న పట్టు వస్త్రాలు, వాటి తయారీకి ఉపయోగించే 4 రంగుల పట్టుదారాలను సోమవారం మంత్రి చేతుల మీదుగా భద్రాచలానికి పంపించారు. సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో పట్టుదారాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర పద్మశాలి సంఘం కార్యదర్శి ఎస్ఎస్ జయరాజ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయులు, చేనేత కళాకారులు వర్కాల సత్యానారాయణ, కరుణాకర్, గణేష్ ఉన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల అందజేత



పాఠశాల విద్యార్థులతో బ్యాంక్ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్రమహిళ సభ రామచంద్రం బాలికల పాఠశాల విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఆట వస్తువులను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో బ్యాంక్ కోఠి డీజీఎం ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులు చదివే పాఠశాలలకు ఆట వస్తువులతో పాటు అల్మారా, వాటర్, ఎయిర్ కూలర్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, నీతీసింగ్, రజని, స్కూల్ ఛైర్ పర్సన్ వెంకమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన పెరగాలి

అమీర్‌పేట: పోషక విలువలు సంపూర్ణంగా ఉండే చిరు ధాన్యాలపై ప్రజల్లో అవగాహన పెరగాలని సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి శ్రీష్ కాటీ అన్నారు.ఈఎస్ఐసీ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఆవరణలో సోమవారం చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈఎస్ఐసీ సిబ్బందికి చిరు ధాన్యాలతో చేసిన వంటకాల పోటీలు నిర్వహించారు. రక్తదాన శిబిరంతో పాటు వ్యాసరచన పోటీలు జరిగాయి. వైద్య విద్యార్థులు యోగాసనాల్లో భాగంగా సూర్యనమస్కార సాధన చేశారు.



చిరు ధాన్యాల వంటకాలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం

అమీర్‌పేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించి టీడీపీకి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం అమీర్‌పేట డివిజన్‌లోని గంగుబాయి బస్తీ, ఈస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో పర్యటించారు. సాయిబాబా, సతీష్, రాజేంద్రప్రసాద్, జయశ్రీ, రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సమాజానికి స్ఫూర్తి మహిళలు

- కార్డినల్ రైట్ రెవరెండ్ పూల ఆంథోని



రాంగోపాల్‌పేట్: మహిళా సాధికారికత, సమానత్వం పొందడం అనేవి వారి చేతుల్లోనే ఉన్నాయని భయం, ఆత్మన్యూనత, పిరికితనం లాంటివి వదిలి పెడితే వాటిని పొందవచ్చని హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ రైట్ రెవరెండ్ పూల ఆంథోని అన్నారు. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ సోషల్ సర్వీసెస్ సొసైటీ (హాస్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలకు వాక్ స్వాతంత్ర్యం, తమ విషయాలు స్వతహాగా నిర్ణయాలు తీసుకోవడం లాంటివి ధైర్యంగా చేయాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళా ప్రగతి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అయితే అక్కడక్కడ ఇంకా మహిళలు, బాలికల పట్ల హింస, హత్యలు చూస్తుంటే అచ్చేదిన్ ఏమో కానీ సచ్చేదిన్ వచ్చినట్లు అనిపిస్తుందన్నారు. మహిళలు ఒక వైపు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి ఒక స్ఫూర్తిలా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా 20 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, హాస్ డైరెక్టర్ ఫాదర్ ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

నా వ్యాఖ్యలు బాధపెట్టినట్లయితే మన్నించండి

- సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ బిషప్



మాట్లాడుతున్న బిషప్ పద్మారావు

రాంగోపాల్‌పేట్: అట్టడుగున వర్గాల ప్రజలు ఏసు ప్రభు పాదాల చెంతకు చేరి ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో తాను మాట్లాడిన మాటలకు ఎవరైనా బాధపడితే క్షమించాలని సీఎస్‌ఐ మెదక్ డయాసిస్ బిషప్ డాక్టర్ కే పద్మారావు కోరారు. సోమవారం ఆయన రెజిమెంటల్‌బజార్‌లోని బిషప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం రాంకోఠిలోని వెస్లీ చర్చిలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ తాను ఏ కులాల నుంచి వచ్చానో అదే ప్రజలు మరింత ఆధ్యాత్మికంగా ముందుకు వచ్చి ఏసు ఆశీర్వాదాలు పొందాలనే ఉద్దేశ్యంతో ఆ కులాల పేర్లు ప్రస్తావించినట్లు తెలిపారు. దీన్ని కొంత మంది బాధపడుతూ రకరకాల వ్యాఖ్యాలు చేస్తున్నారని తాను ఎవరిని కించపరిచేలా మాట్లాడి ఉంటే మన్నించాలని విజ్ఞప్తి చేశారు. తాను 2022లో సీఎస్ఐ మెదక్ డయాసిస్ అధ్యక్ష మండలం బాధ్యతలు స్వీకరించి ఆయా సంఘాలు, విద్యా సంస్థలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ వస్తున్నానన్నారు.

సంస్కృత భాష అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న మృత్యుంజయ శర్మ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ కాలేజీల్లో ఖాళీగా ఉన్న సంస్కృతిక భాష అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని సీఎం కేసీఆర్ గురువు, భాష పండితులు మృత్యుంజయశర్మ అన్నారు. సోమవారం ఓయూలోని సంస్కృత అకాడమీలో జరిగిన సంస్కృత భాష సమ్మేళన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్కృత భాష కోర్సులను అభ్యసించిన నిరుద్యోగుల పోరాట రాష్ట్ర ఆర్థికశాఖ నుంచి జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపక ఉద్యోగాల భర్తీకి అనుమతి లభించిన ఇంత వరకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. సంస్కృత భాషాభివృద్ధికి వెంటనే ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ. కేశవనారాయణ, ప్రొ.నీలకంఠ, విద్యానంద ఆర్య, డాక్టర్ జంగం అవినాష్, శేఖర్, లింగానాయక్ పాల్గొని ప్రసంగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందిస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: పేద ప్రజలు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూతనిస్తోందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్‌కు చెందిన గుప్త రంగారావు, అలీ, గబ్బర్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం ఆమె అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోందన్నారు.

కాన్షీరాంకు 'భారతరత్న' ఇవ్వాలి



స్వరణ్ కౌర్‌ను సత్కరిస్తున్న నాయకులు

బౌద్ధనగర్: కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలని దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరుడు కృష్ణ డిమాండ్ చేశారు. కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలని దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన సోదరి, కాన్షీరాం ఫౌండేషన్ చైర్మన్ స్వరణ్ కౌర్ సోమవారం వారాసిగూడలోని దళిత సంఘర్షణ సమితి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుడు కృష్ణ మాట్లాడుతూ.. కాన్షీరాం బహుజన సమాజమే తన కుటుంబం అని బీఆర్ అంబేడ్కర్ వదిలిన రథాన్ని తన భుజస్కందాలపై వేసుకొని ముందుకు సాగారన్నారు. అంతే కాకుండా భారత దేశ బహుజనుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగశీలి అయిన ఆయనకు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ బచావో' పోస్టరావిష్కరణ

అడ్డగుట్ట: తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న 'తెలంగాణ బచావో' సదస్సును జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు నరసయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం అడ్డగుట్ట అంజయ్య విగ్రహం వద్ద 'తెలంగాణ బచావో' పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం తన తొమ్మిదేళ్ల పరిపాలనలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మళ్లీ ద్రోహానికి గురవుతున్న తెలంగాణను కాపాడుకునేందుకు మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా మార్చి 10న బాగ్ లింగంపల్లిలో తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో 'తెలంగాణ బచావో' సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, రవికాంత్, రామప్ప చారి, నరసింహ, ఎల్లయ్య, వీరయ్య, ఉపేందర్, శ్రీశైలం పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

రసూల్‌పురా: రసూల్‌పురా పోలీస్‌లైన్ సమీపంలోని సయ్యద్ హజ్రత్ ఖాజా షరీఫ్ దర్గా 133వ ఉర్సు ఉత్సవాలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి హాజరై చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక అని కేశవరెడ్డి అన్నారు. కుల మతాలకు అతీతంగా ఉర్సు ఉత్సవంలో భాగంగా దర్గాలో చాదర్ సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖాద్రీ సాహెబ్, తౌఫిక్, సైఫ్, కరీం, కిషన్, దర్గా కమిటీ సభ్యులు సహాబ్, ఆరిఫ్, ఫయాజ్, అజీమ్, సలీమ్, రహిం, ముజఫర్, మోహిజ్ అశోక్ పాల్గొన్నారు.



చాదర్ సమర్పిస్తున్న సదా కేశవరెడ్డి

ఆంజనేయ ఆలయంలో పూజలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు అన్నానగర్ చౌరస్తాలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ, హనుమాన్ విగ్రహం పునర్‌ప్రతిష్ట సోమవారం వైభవంగా నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, సదా కనితా రెడ్డి దంపతులు పూజ కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. హనుమత్ పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్, నిర్వాహకులు మద్దేల యాదగిరి, వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి..వ్యక్తి రిమాండ్



వీరాంజనేయులు

అమీర్‌పేట: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ బాల్‌రాజ్ వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి అమీర్‌పేట ధరంకరం రోడ్డులో గొడవ జరుగుతుందని 100కు ఫోన్ రావడంతో బీసీ–1లో విధుల్లో ఉన్న జి.ఆర్.ప్రసాద్ వెళ్లాడు. గొడవ పడుతున్న వారితో మాట్లాడుతుండగా వీరాంజనేయులు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనాన్ని నడిరోడ్డులో నిలిపాడు. బైక్ తీయాలని కానిస్టేబుల్ చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న వీరాంజనేయులు దుర్భాషలాడుతూ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని ఛాతీపై కొట్టాడు. పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు.విధులకు ఆటంకంతో పాటు కానిస్టేబుల్‌పై దాడి చేసిన వీరాంజనేయులును రిమాండ్‌కు తరలించారు.

PUBLIC NOTICE

The General Public hereby informed that My Client Sri Ranbeer Singh Gandhi S/o. Late Amrik Singh Gandhi R/o. Plot No 64 & 65 Shantineketan Colony Mahendra hills Hyderabad, had lost the original registered Gift deed document No. 1053/2003 in the name of Mrs. Surjeet kaur W/o.Late Amrik Singh Gandhi & Mrs.Mandeep Kaur W/o. Satyajit Singh D/o. Amrik Singh, and copies of link documents, in respect of the Flat bearing No.401 Fourth Floor 2850 Sq feet, situated at Vengalrao Nagar Penderghast Road Secunderabad and also few original cheque leafs issued by union bank of India in the name of Divesh Singh Gandhi. My client had lodged a written complaint to the Station House Officer, SR Nagar Police Station on 27-12-2022 about the loss of the original Gift Deed. If anybody, person or persons found the lost document they may hand over the same to the undersigned. Further if anybody indulge in the acts of misuse of the said original sale Deed they would be doing so at their own risk and would invite legal consequences.

G.SANJEEVA REDDY, Advocate
Office: 3-6-525/C, 4th Floor, Upstairs of Hotel Akshaya, Himayathnagar, Hyderabad -29
Mobile: 9849275949. Dt. 09-01-2023.

జనరిక్ మందుల వాడకాన్ని ప్రోత్సహించండి


రాంగోపాల్‌పేట్: బ్రాండెడ్ మందులకు బదులుగా జన్ ఔషధి (జనరిక్) మందుల వాడకాన్ని ప్రోత్సహించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం తప్పుతుందని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ జాయింట్ డైరెక్టర్ రంధాన్ అన్నారు. జన్ ఔషధి వారోత్సవాల్లో భాగంగా సోమవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు జనరిక్ మందులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాండెడ్ మందుల కన్నా జన్ ఔషధి మందులు 50–90 శాతం తక్కువ ధరకు లభిస్తాయన్నారు. దేశ వ్యాప్తంగా 9 వేల జన ఔషధి ఔట్‌లెట్లు ఉండగా తెలంగాణాలో 78 ఉన్నాయని దేశ వ్యాప్తంగా మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన మందులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఓపెన్ ఎన్‌జీవో అధ్యక్షులు గోపు రమణారెడ్డి మాట్లాడుతూ.. జన ఔషధి షాపును తెరుచుకునేందుకు రూ.3 నుంచి 5 లక్షలు ఖర్చు అవుతాయని ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సౌరవ్ జైస్వాల్, ప్రిన్సిపాల్ మురళీధర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభానికి సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభానికి సిద్ధమైంది. కరోనా కారణంగా గత మూడేళ్లుగా మూసివేసిన పూల్‌ను ఇటీవల మరమ్మతులు చేసి నీటితో నింపారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఓయూ విద్యార్థులు, ఉద్యోగుల కుటుంబాలతో పాటు బయటి వ్యక్తులకు కూడా ప్రవేశం కల్పించనున్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379